కూతురు పెళ్ళి

నాన్న చనిపోయి దాదాపు నాలుగేళ్లు దాటింది!

ఈ నాలుగేళ్లలో కుటుంబాన్ని ఎంతో గుట్టుగా ఈడ్చుకొచ్చాను. ఇంటి పెద్ద కొడుకుగా తండ్రి తరువాత బాధ్యతను నెరవేర్చవలసిన అర్భకుడిని. నాన్న బ్రతికున్న రోజులలో చెప్తుండే వాడు 'పది మందితో సంతోషాన్ని పంచుకో, దుఃఖభారాన్ని మాత్రం ఒంటరిగానే అనుభవించు' అని. ఈ సిద్ధాంతాన్ని అనుసరించి ఎన్ని బాధలున్నా నాలోనే దాచుకుని నా వాళ్లందరికీ సుఖాన్నే ఇచ్చాను.

నిజమే అమ్మ చెప్పేంత వరకు ఇప్పటి ఇంటి సమస్య అసలు 'ఇదీ' అని తెలుసుకొనలేక పోయాను. ఒక వేళ తెలుసుకుని ఉంటే మాత్రం ఏం చేస్తాను!?

ఈ రోజుల్లో ఆడపిల్ల పెళ్లి చేయడమంటే మాటలా! దరిదాపు లక్ష రూపాయలు పట్టుకుంటేనే గాని పెళ్లి కావడం కష్టం.

నెలకు వచ్చే ఆరువందల జీతం రాళ్ళూ కాక ఎక్స్ట్రా పద్దులు వ్రాసి ఓ రెండు వందలు అదనంగా సంపాదిస్తున్నాను.

అనసూర్య రాంబాబు

కుటుంబ బాధ్యత నెత్తిమీద భారం అనుకోకుండా గుండెల మీద బాధ్యత అనుకుని ఎవ్వరికీ ఏలోటూ రానివ్వకుండా చూసుకొచ్చాను ఇంతవరకు. కానీ అసలు బాధ్యత వెనుక పెట్టుకుని ముందుకు చూస్తున్నానని ఈ రోజు అమ్మ చెప్పిన మాటలను బట్టి తెలిసింది.

'నేను చెప్తుంటే చేయడం కాదు గొప్ప. ఈ ఇంటి పోషకుడిగా ఎవరికి ఏదారి చూపించాలో నువ్వే తెలుసుకుని కుటుంబ గౌరవాన్ని నిలబెట్టాలి. నీ చెల్లెలి వయస్సు 'ఇంతని' ఎవరికైనా తెలిస్తే ఈ జన్మకు దాని పెళ్లి కాదు. ఇప్పటికైనా మించిపోయింది లేదు. మనకు తగ్గ సంబంధం చూసి ఏదో ధాని పెళ్లి అయిందనిపించు. దాని తరువాత పెళ్లి కావలసిన ఆడముండ ఇంకొకర్తి ఉంది. మీ నాన్నగారే బ్రతికుంటే వాళ్లకీ దుస్థితి పట్టేదికాదు. తలో, తోకో తాకట్టు పెట్టి వాళ్ల పెళ్లి జరిపించేవారు.

ఈ ఎనిమిది వందలలోనే ఇంటద్దె, జులాయిగా తిరిగే రెండవ తమ్ముడికి చేబదుళ్లు, చిన్న తమ్ముడి చదువు ఖర్చులు, నాన్న చేసిన అప్పులకు వడ్డీలు, ఇంట్లో వెచ్చాలకు అన్నీ ఇందులోనే. ఇవన్నీ చక్కబరిచే సరికి తల్ప్రాణం తోకకొస్తుంది.

ఈ పరిస్థితులలో చెల్లెళ్ళ పెళ్లి చేయడం నాకు తలకు మించిన పని. అయినా నా ప్రయత్నం నేను చేయాలి గాబట్టి నాకు తెలిసున్న వారినందరినీ అప్పుగా అడిగి చూశాను.

ఏ వస్తువూ పెట్టనిదే అంత అప్పు ఎవరిస్తారు. 'పిచ్చివాడా' అన్నవాళ్లే అందరూనూ.

పది రోజులు గడిచిపోయాయి.

ఏదో యాంత్రికంగానే ఉంటున్నాను గాని నా ఆలోచనలు, మనస్సు కాలం కంటే వేగంగా పరుగులు తీస్తున్నాయి.

అయినా ఇంటి సమస్యలకు పరిష్కారం దొరకలేదు.

భోజనం చేస్తుంటే అమ్మ వచ్చి ప్రక్కన కూర్చుంది నాకు తెలుసు నేను భోజనం చేసేటప్పుడు అమ్మ నా ప్రక్కన కూర్చుందీ అంటే ఏదో ముఖ్యమైన విషయం చెప్పాలనే.

నేను తలదించుకుని మౌనంగా భోజనం చేస్తున్నాను.

'ఒరే శంకరం... చెల్లెళ్ళ పెళ్లి ఘనంగా జరిపించే మార్గం ఒకటుంది...' అమ్మ చెప్తుంటే తలెత్తి ఆర్తతగా అమ్మ ముఖంలోనికి చూశాను.

'నీకొక పెళ్లి సంబంధం చూశాను... ఆ పిల్ల తండ్రి నీకిస్తామంటున్న కట్నం లక్షా పాతిక వేలు. ఎప్పటికైనా నువ్వూ ఒక ఇంటి వాడివి కావలసిందేగా. అందుకే ముందు నీ పెళ్లి జరిగితే నీకొచ్చే కట్నంతో చెల్లెళ్ల పెళ్లి చేయొచ్చు. కానీ అసలు విషయం చెప్తే నువ్వు మండిపడతావు' అని సందిగ్ధంగా నాముఖంలోనికి చూసింది అమ్మ.

'చెప్పమ్మా! నేనేమీ అనను' చెప్పాను అమ్మతో

అమ్మ మళ్లీ నావైపు ఒకసారి భయంగా చూసి 'ఆ పిల్లకు కూడా నీలాగే అంగవైకల్యం ఉంది. నీవు పుట్టుకతోనే కుడికాలు లేకుండా పుట్టావు. కానీ ఆ పిల్లకు చిన్నప్పుడు యాక్సిడెంటులో ఎడంకాలు పోయిందట. అందుకని మరో యాభై వేలు కట్నం అదనంగా ఇస్తానన్నారు...'

చెళ్లుమని కొట్టినట్టయింది. నాలోని 'లోపమిదీ' అని నేనెన్నడూ అనుకోలేదు. కానీ అమ్మ 'నీలాగే ఆమెకూ అంగవైకల్యం ఉందంటూ' నాలోని కుంటి తనాన్ని ఎత్తి చూపించింది.

'అసలు విషయం చెప్తే నీవు మండిపడతావు' అన్నదే కాని బాధ పడతావు అనలేదు.

కూతురి పెళ్లి చేయడం కోసం కొడుకును 'ఎర'గా చూసుకుందీ కన్నతల్లి.

నేను కుంటివాడినే, నాకు వచ్చే భార్య కూడా కుంటిదయితే మా సంసారమే కుంటుపడుతుందని గ్రహించలేక పోయింది.

'కన్న తల్లికింత స్వార్థ ముండొచ్చా?'

'ఇది స్వార్థం ఎలా అవుతుంది? పరిస్థితుల ప్రభావం మనిషిని ఇలా దిగజారుస్తుంది'. మనస్సుకు సర్దిచెప్పాను.

రెండొందల ఎక్స్ట్రా సంపాదనలా అనిపించిందీ యాభైవేల కట్నం. ○

ఉదయం వారపత్రిక